క్లుప్తంగా

తిరుపతి గంగమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో తిరుపతి గంగమ్మ

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు చెరువు కట్ట మీద వెలసిన తిరుపతి గంగమ్మకు ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వేకువ జామున సుప్రభాతంతో అమ్మవారిని మేల్కొలిపి అభిషేకం, అర్చనలు చేశారు. విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

నేడు డయల్ యువర్ కమిషనర్

తిరుపతి తుడా: ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. ప్రజలు సోమవారం ఉదయం 9:30 గంటల నుంచి 10:30 వరకు 0877–2227208కి కాల్ చేసి సమస్యలను తెలపవచ్చన్నారు. అలాగే ఉదయం 10:30 నుంచి నేరుగా కార్యాలయానికి వచ్చి సమస్యలపై ఫిర్యాదులు అందజేయవచ్చని వెల్లడించారు.

తోట జగన్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి

తిరుపతి సిటీ: స్థానిక వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు తోట లత కుమారుడు తోట జగన్ ఆకస్మిక మృతికి టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. స్థానిక గిరిపురంలోని వారి నివాసం వద్ద ఆదివారం ఉదయం తోట జగన్ భౌతిక కాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు.

రేపటి నుంచి ప్రసన్న వెంకన్న పవిత్రోత్సవాలు

తిరుపతి కల్చరల్: అప్పలాయిగుంట ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం సోమవారం సాయంత్రం అంకురార్పణ జరగనుంది. యాత్రికులు, సిబ్బంది కారణంగా తెలియక చేసిన దోషాలతో ఆలయ పవిత్రతకు లోపం రాకుండా నివారించేందుకు పవిత్రోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. పవిత్రోత్సవాల్లో భాగంగా మొదటి రోజైన మంగళవారం పవిత్ర ప్రతిష్ఠ, 11న పవిత్ర సమర్పణ, పవిత్ర హోమాలు చేపడతారు. చివరి రోజు 12న మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన జరగనుంది. పవిత్రోత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు.

వరసిద్ధునికి కళాకారుల సాంస్కృతిక నీరాజనం



కాళికామాత అవతారంలో కళాకారిణి నృత్య ప్రదర్శన

కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వార్షిక ప్రత్యేక ఉత్సవాల్లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారి ఆస్థాన మండపంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కళాకారులకు ఆలయ అధికారులు ప్రశంసాపత్రాలు అందించారు.

–కాణిపాకం(యాదమరి)





భరతనాట్యం చేస్తున్న కళాకారులు

వ్యవస్థలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు

- పేదల పక్షపాతి సీఎం జగన్
- ఖాతాల్లోకి నేరుగా రూ.3.50 లక్షల కోట్లు బదిలీ
- టీడీపీ, ఎల్లో మీడియా భ్రమలో విహరిస్తున్నాయి
- అఖండ మెజారిటీతో వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయం
- టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి సిటీ: వ్యవస్థలను, చట్టాలను మోసం చేసిన చంద్రబాబు నేడు జైలులో ఊచలు లెక్కపెడుతున్నారని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి విమర్శించారు. తిరుపతి కొర్లగుంట డీబీఆర్ కల్యాణ మండపంలో ఆదివారం వైఎస్సార్ సీపీ తిరుపతి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంపై విజయవాడ సభకు సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ దుష్ట పన్నాగాన్ని ఎదుర్కోవడానికి అందరం సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎల్లో మీడియా భ్రమల్లో విహరిస్తూ, ప్రభుత్వంపై విషపు రాతలు రాస్తోందని దుయ్యబట్టారు. ప్రజలు వాటిని విశ్వసించడం లేదని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేదల పక్షపాతి అని, దేశంలో ఏ రాష్ట్రంలోనూ చేయని విధంగా రూ.3.50 లక్షల కోట్లను పేద ప్రజల ఖాతాల్లో బదిలీ చేసిన ఏకైక సీఎం అని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీకి సామాన్య ప్రజలు, సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులే రక్షణ కవచాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న 60 శాతం పేద ప్రజలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆస్తి అని, వారే తిరిగి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అఖండ మెజారిటీతో గెలవనుందని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలన మోసపూరితంగా సాగిందని, ఈ విషయాన్ని ప్రజల ముందుకు తీసుకెళ్లాలని కార్యకర్తలను కోరారు. చంద్రబాబు జైలుకు వెళ్తే ఆపార్టీ కార్యకర్తలు, నాయకులు బూరలు, ఈలలు వేసి సంబరాలు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. విజయవాడలో సోమవారం జగనన్న చేయనున్న దిశానిర్దేశం మేరకు ప్రతి ఒక్కరూ పార్టీ విజయంకోసం సిద్ధం కావాలన్నారు. డిప్యూటీ మేయర్, తిరుపతి ఎమ్మెల్యే అభ్యర్థి భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కార్యకర్తగా, మీలో ఒకడిగా ఉంటూ మీ ఆశీస్సులతో డిప్యూటీ మేయర్‌గా తన బాధ్యతలను నిర్వహిస్తూ తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. గత 70 ఏళ్లుగా చేయలేని అభివృద్ధిని రెండేళ్లలో చేసి చూపించి ప్రతి వైఎస్సార్ సీపీ కార్యకర్తా కాలర్ ఎగరేసి ఇది నగరాభివృద్ధి అని చెప్పుకునే స్థాయికి చేరుకోవడం గర్వంగా ఉందన్నారు. డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, కార్పొరేటర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఈనెల 11 నుంచి నెల రోజులు జరిగే కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఇంటింటా ప్రచారం చేయాలని సూచించారు. గతంలో పార్టీ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించామని ఆదే స్ఫూర్తితో ఏపీకి జగన్ ఎందుకు కావాలంటే అనే కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏపీకి జగనన్న ఎందుకు కావాలంటే అనే కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు చేయవలసి విధివిధానాలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ సమావేశంలో తిరుపతి నియోజకవర్గంలోని 50 డివిజన్ల పార్టీ అధ్యక్షులు, కార్పొరేటర్లు, కోఆప్షన్‌సభ్యులు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



మాట్లాడుతున్న భూమన అభినయ్‌రెడ్డి

విశ్వబ్రాహ్మణ వసతి గృహానికి స్థలం కేటాయించాలని వినతి



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్లు, విశ్వబ్రాహ్మణ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే విశ్వబ్రాహ్మణ కులస్తులకు వసతి గృహం నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోటి శ్రీకాంత్ విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదివారం టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. వసతి గృహానికి స్థలం కేటాయిస్తే భవనం నిర్మించి భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో జిల్లా విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మైలాపూర్ భారతి, నగర స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు ఎం.కార్తీక్, జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు తిరుమల ఆచారి, ప్రధాన కార్యదర్శి ఉమాపతి ఆచారి, నాగార్జున, శివ ఆచారి, నరేంద్ర ఉన్నారు.

చరిత్రను సజీవంగా నిలిపేది ఫొటో



ఫొటో స్టూడియోను ప్రారంభిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: చరిత్రను సజీవంగా నిలిపే శక్తి ఫొటోలు, వీడియోలకు మాత్రమే ఉందని తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం తిరుపతి రూరల్ మండలం అవిలాలలో విజన్ ఫొటో స్టూడియోను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఫొటోలు, వీడియోల ద్వారా జ్ఞాపకాలు, మధుర స్మృతులను జీవిత కాలం భద్రపరుచుకోవచ్చని తెలిపారు. డబ్బా కెమెరాల నుంచి స్మార్ట్ ఫోన్ల వరకు ఎన్నో మార్పులు, మరెన్నో పరిణామాలు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. సందర్భంగా స్టూడియో నిర్వాహకులు దేవేంద్ర, మాదేష్‌కు అభినందనలు తెలిపారు.

వైభవంగా మలయపెరుమాళ్ ఊరేగింపు



పిచ్చాటూరులో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత మలయపెరుమాళ్



రామగిరిలో ఊరేగుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి



పిచ్చాటూరు ఆలయంలో ప్రత్యేక అలంకారంలో మలయపెరుమాళ్

పిచ్చాటూరు: పురటాశి నెల మూడో శనివారాన్ని పురస్కరించుకొని పట్టణంలో మయలపెరుమాళ్ ఊరేగింపు శనివారం రాత్రి అత్యంత వైభవంగా సాగింది. ఊరేగింపుగా వచ్చిన స్వామి, అమ్మవార్లకు ప్రజలు కొబ్బరికాయలు కొట్టి కర్పూరహారతులతో నీరాజనాలు పలికారు. ఈ సందర్భంగా మూలవిరాట్ అయిన శ్రీవారికి అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. వెంకన్నను దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం పలికారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయ పెరుమాళ్ ఉత్సవమూర్తిని ట్రాక్టర్‌పై ఉంచి ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవాయిద్యాలు, బాణసంచా పేలుళ్ల మధ్య శ్రీవారి ఊరేగింపు ఘనంగా సాగింది. అలాగే మండలంలోని అడవికండ్రిగ గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం గోవిందమాల ధరించిన భక్తులు కాలినడకన తిరుమల బయలుదేరి వెళ్లారు.

బస్టాండ్‌లో తగ్గుతున్న ట్రాఫిక్ సమస్య



శ్రీనివాస సేతు నుంచి బస్టాండ్‌లోకి వస్తున్న ఆర్టీసీ బస్సులు

తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో ట్రాఫిక్ సమస్య రెండు రోజులుగా తగ్గుముఖం పట్టింది. గతంలో బస్సులను ఎక్కడ పడితే అక్కడ నిలుపుతుండడంతో బస్సు బస్టాండ్‌లోకి రావాలన్నా, తిరిగి వెళ్లాలన్నా 20 నుంచి 30 నిమిషాలు పట్టేది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి నాలుగు రోజుల క్రితం హయ్యర్ బస్సుల ఓవర్స్‌తో సమావేశం నిర్వహించి బస్సులను తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో పార్కింగ్ చేయరాదని ఆదేశించారు. అంతేగాక బస్టాండ్‌లోకి వచ్చే బస్సులు శ్రీనివాస సేతు నుంచి దిగేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తగ్గుముఖం పట్టింది.

మలేషియాకు మహిళావర్సిటీ రిజిస్ట్రార్



ప్రొఫెసర్ ఎన్.రజిని

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎన్.రజినికి మలేషియా నుంచి ఆహ్వానం అందింది. ఆమె ఈ నెల 9 నుంచి 11 వరకు మలేషియాలోని యూనివర్సిటీ మలేషియా తెరాంగులో జరగనున్న ఫుడ్ సస్టైనబిలిటీ, సెక్యూరిటీ అనే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొననున్నారు. పదో తేదీలో జరిగే ప్లీనరీ స్పీకర్‌గా కీ నోట్ అడ్రస్ ఇవ్వనున్నారు. అదేవిధంగా పానల్ డిస్కషన్, ఇంటరాక్షన్‌లో పాల్గొంటారు. ఆమె ఆదివారం రాత్రి తిరుపతి నుంచి బయలుదేరి వెళ్లారు.

నేడు మండల పూజ



సదుం: మండలంలోని జాండ్రపేట అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో సోమవారం మండల పూజ చేయనున్నారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేసి 40 రోజులు పూర్తయిన సందర్భంగా పూజలతోపాటు అభిషేకాలు చేయనున్నట్టు ఆలయ ధర్మకర్త సురేంద్రరెడ్డి ఆదివారం తెలిపారు. ఉదయం నుంచి భక్తులకు ఆలయంలో అన్నదానం చేస్తామన్నారు.

త్రైత సిద్ధాంతంతో ఆధ్యాత్మికత పెంపు



సీఐ సురేష్‌కు భగవద్గీత పుస్తకాన్ని అందజేస్తున్న కమిటీ సభ్యులు

నగరి: ఆధ్యాత్మిక జ్ఞానాన్ని ప్రసాదించడానికే త్రైత సిద్ధాంత భగవద్గీత గురించి ప్రచారం చేస్తున్నట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక తెలిపారు. ఆదివారం వారు భగవద్గీత పుస్తకాలను నగరి సీఐ సురేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఈ నెల 16వ తేదీ నుంచి 22వ తేదీ వరకు త్రైత సిద్ధాంతం భగవద్గీత గురించి ప్రచారం చేస్తున్నట్లు త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ, బంగారుపాళ్యం కమిటీ, వి.కోట కమిటీ అధ్యక్షుడు డి.సురమౌళి, డి.బాలాజీ, కే.అశోక్ బాబు తెలిపారు. నియోజవర్గంలో నిర్వహించే కార్యక్రమాల వివరాలను వారు తెలియజేశారు. ప్రచారానికి సంబంధించిన సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. భగవద్గీత ప్రచారం కోసం దాదాపు 300 మంది భక్తులు వస్తారని, ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామాల్లో ప్రచారం చేస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు మంత్రికి ఆహ్వానం



మంత్రి మేరుగు నాగార్జునను ఆహ్వానిస్తున్న జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఈ నెల 15వ తేదీన తిరుపతిలో మొట్టమొదటిసారి జరిగే రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొనాలని రాష్ట్ర మంత్రి మేరుగు నాగార్జునను తిరుపతి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.ప్రవీణ్ కోరారు. తిరుపతి విచ్చేసిన మంత్రి ని వారు కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కరాటే పోటీల ప్రారంభోత్సవానికి రావాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ రత్నకుమార వెంకటేశ్వర్లు, జీవరత్నంరెడ్డి పాల్గొన్నారు.

రాయలసీమ జన జీవన కథా చిత్రమే సగిలేటి కథ



మాట్లాడుతున్న సగిలేటి కథ చిత్రం హీరో రవి మహాదశం

తిరుపతి కల్చరల్: రాయలసీమ జన జీవన శైలితో పాటు సంప్రదాయాలను ఆవిష్కరిస్తూ సరికొత్త పంథాలో ప్రేక్షకులను ఆకట్టుకునే చక్కటి ఎంటర్‌టైమెంట్ కథా చిత్రం సగిలేటి కథ అని దర్శకుడు రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 13వ తేదీన సగిలేటి కథ చిత్రం విడుదల కానుంది. ఈక్రమంలో ఆయన ఆదివారం సాయంత్రం చిత్రం యూనిట్ సభ్యుల తో ఒక హోటల్లో మీడియాతో మాట్లాడారు. తాను తిరుపతి వాసినని తెలిపారు. తొలిసారి కొత్త హీరో రవి మహాదశం, హీరోయిన్ విహిక, రాయలసీమకు చెందిన నటులతో సినిమాను రూపొందించినట్టు తెలిపారు. ఇటీవల విడుదలైన చిత్ర ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. రాయలసీమ ప్రజల సంప్రదాయాలు, జీవన శైలిని వివరిస్తూ రూపొందించిన చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈనెల 13న విడుదలవుతున్న ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. హీరో రవి మహా దశం మాట్లాడుతూ రాయలసీమ అంటే ఫ్యాక్షనిజం అనే తరహాలో చిత్రాలు వచ్చాయని, వాటికి భిన్నంగా రాయలసీమ ప్రజల జీవన శైలి, సంప్రదాయాలను ఆవిష్కరిస్తూ రెండు గంటల సేపు చక్కటి ఆనందాన్ని పంచేలా ఈ చిత్రం ఉంటుందన్నారు. ఈ చిత్రాన్ని ఆదరించి ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో చిత్ర నిర్మాత దేవిప్రసాద్, సంగీత దర్శకుడు జశ్వంత్, నటులు నరసింహాప్రసాద్, శాంబోలు హరినాథ్ పాల్గొన్నారు.

వీనులవిందు చేసిన గాత్ర కచేరి



పాటలను ఆలపిస్తున్న గాయకులు

తిరుచానూరు(చంద్రగిరి): వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన గాత్ర కచేరి వీనులవిందు చేసింది. తిరుపతికి చెందిన దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో గాయకులు శిరీష, సాయి స్పందన, సుదర్శన్ పలు పాటలను ఆలపించారు. వారికి కీబోర్డుపై దేవా సహకరించారు. కళాకారులను ఏవో ఖాదర్‌వలి సత్కరించి, జ్ఞాపకలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ, పప్పి, వరప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమరాల్డ్స్‌లో ఘనంగా ఎలివేట్-2023



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: ఎల్‌బీసీ రోడ్డులోని ఎమరాల్డ్స్ డిగ్రీ కళాశాల కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ఎలివేట్ –2023 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రథమ, ద్వితీయ, తృతీయ ఏడాది కామర్స్ విద్యార్థులు సుమారు 400 మంది యార్డ్ వార్ క్విజ్ ఇట్, పికాసో, జంక్ యార్డ్, స్పీక్ అప్, స్టాక్ బజ్ వంటి విభాగాల్లో ప్రతిభ చాటినట్టు ఎమరాల్డ్స్ ఉప సంచాలకుడు మునిరత్నం తెలిపారు. ఇందులో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆ కళాశాల డైరెక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ విద్యార్థులు పోటీల్లో పాల్గొనడం వల్ల నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. స్పీక్ అప్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో పి.మోహిత్, కె.శోభ నిలిచారు. క్విజిట్‌లో పీయూష్, నీరజ్, నిఖిల్ ప్రథమ, చరణ్‌కుమార్, నావి శేఖర్, హేమంత్ రెండో స్థానంలో నిలిచారు. యార్డ్ వార్‌లో సూర్య విగ్నేష్, వంశీకృష్ణ ప్రథమ స్థానం, పికాసోలో భవ్యశ్రీ, సాయిశ్రావణి ప్రథమ స్థానం, సాయి వందన, లావణ్య ద్వితీయ స్థానం పొందారు. జంక్‌యార్డ్‌లో కమల్ ప్రథమ స్థానం, కల్యాణి ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కామర్స్ విభాగాధిపతి రమేష్, సుధాకర్, జాహ్నవి, భాను, కిరణ్ పాల్గొన్నారు.

భగవద్గీత ప్రవచనాలు ప్రారంభం



అనుగ్రహ భాషణం చేస్తున్న స్వాత్మానందగిరిస్వామి

శ్రీకాళహస్తి: పట్టణంలోని ముత్యాలమ్మగుడి కల్యాణ మండపంలో శుకబ్రహ్మాశ్రమ ఆధ్వర్యంలో భగవద్గీతలోని రాజవిద్య, రాజగుణయోగం అంశంపై ఆధ్యాత్మిక ప్రవచనం ప్రారంభించారు. ఆశ్రమ పీఠాధిపతులు విద్యాస్వరూపనందగిరిస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆశ్రమ స్వామీజీ స్వాత్మానందగిరిస్వామి ఆధ్యాత్మిక ప్రవచనం అనుగ్రహ భాషణం చేశారు. కార్యక్రమంలో స్థానికులు జనార్ధన్‌రావు, గరికపాటి రమేష్‌బాబు, న్యాయవాది రాజేశ్వరరావు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన రేబల ముత్తు రజనీకాంత్‌రెడ్డి జ్ఞాపకార్థం ప్రసూనాంబ ఆదివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఈఓ సాగర్‌బాబు స్వీకరించి దాతలకు కృతజ్ఞలు తెలిపారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.